క్లుప్తంగా

క్యాపిటల్ ఆస్పత్రిలో 70 మంది రక్తదానం



పెనమలూరు: పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో శనివారం 70 మంది రక్తదానం చేశారు. ఆస్పత్రి ఆరవ వార్షికోత్సవం సందర్భంగా రక్తదానం శిబిరాన్ని ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మన్నే హరీష్ ప్రారంభించారు. న్యూసిటీ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాకాంత్, క్యాపిటల్ ఆస్పత్రి సీఈఓ శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఉయ్యూరు పట్టణ ఎస్‌ఐగా వాసు బాధ్యతల స్వీకారం

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణ ఎస్‌ఐగా జి.వాసు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎన్.వీరప్రసాద్‌ను మచిలీపట్నంకు బదిలీ చేస్తూ మచిలీపట్నం ఆర్.పేట ఎస్‌ఐగా పనిచేస్తున్న వాసును ఉయ్యూరుకు నియమిస్తూ జిల్లా ఎస్పీ పి.జాషువా ఉత్తర్వులు జారీ చేశారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

డీఈఓ తాహెరా సుల్తానా

కంకిపాడు: మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత అని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకీ పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోందని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, హెచ్‌ఎం పద్మావతి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.ఎస్.మల్లేశ్వరరావు, ఎం.గోవిందరావు, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ రూ.6.70 లక్షలు మంజూరు

కంకిపాడు: సీఎం రిలీఫ్ ఫండ్ పేద వర్గాలకు ఊరటగా నిలుస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు మండలం గంగూరు గ్రామానికి చెందిన తస్లీమున్నీసా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ రూ.6.70 లక్షలకు మంజూరు చేశారు. ఈ మేరకు మంజూరు పత్రాలను శనివారం ఆయన గ్రామస్తులకు అందజేశారు. గ్రామస్తులు అక్బర్‌పాషా తదితరులు ఎమ్మెల్యే పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ సొమ్ము విడుదల

పెనమలూరు: అక్టోబర్ నెలకు సంబంధించి మండలానికి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందని శనివారం ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ పెనమలూరు, తాడిగడప మున్సిపాలిటీలో మొత్తం 18,608 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వం రూ.5.18 కోట్లు విడుదల చేసిందన్నారు. పెనమలూరు మండలంలో 5755 మందికి రూ.1,59,34,750, తాడిగడప మున్సిపాలిటీలో 12,853 మందికి రూ.3,59,24,500 నిధులు విడుదల చేశారన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉండే లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు.

పేదల ఆరోగ్య రక్షణే జగనన్న లక్ష్యం

- అక్టోబర్ 11 నుంచి 'జగనే కావాలి'
- పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



జగనే కావాలి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేద ప్రజల ఆరోగ్య రక్షణే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కానూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని వారికి పూర్తి వైద్య సేవలు అందించటానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. శనివారం నుంచి 45 రోజుల పాటు రాష్ట్రంలో 10,574 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరాల్లో 5 వేల మంది వైద్యులు 1.67 కోట్ల కుటుంబాలకు 14 రకాల డయాగ్నస్టిక్ పరీక్షలు చేసి, 172 రకాల మందులు ఉచితంగా అందజేస్తారన్నారు.

ఆంధ్రాకి జగనే కావాలి...

ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం అక్టోబర్ 11 నుంచి నవంబర్ 11వ తేదీ వరకు నిర్వహిస్తామని పార్టీ నేతల సమావేశంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల కింద ఎంత సొమ్ము అందిందీ బోర్డు ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. టీడీపీ గతంలో ఇచ్చిన హామీలు ఏమిటి, ఎంతవరకు హామీలు అమలు చేసిందీ, జగనన్న ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమిటి.. ఎంతవరకు అమలు చేశారనే విషయం ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తామన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే బోడె ప్రసాద్ దీక్ష

కేవలం రాజకీయ లబ్ధి కోసమే బోడె ప్రసాద్ దీక్ష చేస్తున్నాడని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. చంద్రబాబు అవినీతిపై కోర్టులో విచారణ జరుగుతోందని, కోర్టు ఆదేశాలతోనే చంద్రబాబు జైల్లో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, పెనమలూరు అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, తాడిగడప అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, రాజులపాటి రామచంద్రరావు, వల్లే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో...

గన్నవరం: ప్రజల ఆరోగ్య భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంప్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసానితో కలిసి ఆయన ప్రారంభించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. సర్పంచి నిడమర్తి సౌజన్య, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, ప్రత్యేకాధికారి ఎండీ.హాజీబేగ్, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు, డీటీ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

చోడవరం, కానూరుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు అన్నారు. చోడవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపును ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు 400 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్, వైద్యులు రమేష్ కృష్ణ, సుష్మిత, షీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కానూరులో..

కానూరు 1 సచివాలయంలో జగనన్న వైద్య సురక్ష శిబిరాన్ని కెనడీ పాఠశాలలో నిర్వహించారు. దాదాపు 600 మంది పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తాడిగడప అసిస్టెంట్ కమిషనర్ అవినేష్, డాక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

333 మందికి వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేకాధికారి పీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. స్థానిక కేపీఎస్ టాకీస్ రోడ్డులోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో 333 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురు రోగుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ఎంజే మంజూషా, వై.కిరణ్మయి, నారయ్య, సుమన్‌కుమార్, విద్యాధరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్యాంపు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్త్ అండ్ న్యూట్రిషన్ స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ చిత్ర గురుస్వామి, ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఎంపీడీవో జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పలువురు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఉయ్యూరు పట్టణంలో విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుంచే జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో వైద్యులు 855 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. తొలుత సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆర్డీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, పలువురు కౌన్సిలర్లు శిబిరాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో ప్రభుత్వ వైద్యులతో పాటు ఉయ్యూరు పట్టణానికి చెందిన పలువురు ప్రైవేటు వైద్యులు కూడా వైద్య సేవలు అందించారు.



హనుమాన్ జంక్షన్‌లో హెల్త్ అండ్ న్యూట్రిషన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్



చోడవరం జగనన్న సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ఉంగుటూరు: ప్రజల ముంగిటకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశ పెట్టిందని మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి అన్నారు. ముక్కపాడు గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 557 మందిని గుర్తించగా 517 మందికి వైద్యసేవలు అందించారు. ముక్కపాడు, లంకపల్లి, వేమండ గ్రామాల సర్పంచులు ఎస్.అంజనాదేవి, కె.సుజాత, హెచ్.నిర్మల, ఎంపీటీసీ నాగిరెడ్డి, డాక్టర్లు కె.ప్రసన్నరాణి, బి.శిరీష, టి.అఖిల్‌తేజ, సీహెచ్.సుగుణవతి, ఏఎన్ఎంలు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బొప్పన సీతారామరాజు, కార్యదర్శులు కృపాకుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఉయ్యూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



ముక్కపాడులో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

కంకిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

శిబిరాన్ని సందర్శించిన పంచాయతీ రాజ్ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్

కంకిపాడు: కంకిపాడు-2 సచివాలయ పరిధిలోని ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ దినేష్ జనరల్ సర్జరీ, ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, కంకిపాడు వైద్యులు డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ చంద్రిక, డాక్టర్ నికిత, డాక్టర్ రాజేష్‌కుమార్, వైద్యారోగ్య సిబ్బంది శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్య సూచనలు అందించారు. ఆరోగ్య శ్రీ సేవలు అవసరమైన రోగులకు ఆసుపత్రుల సమాచారాన్ని తెలియజేశారు.



శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్

వైద్య సేవలపై ఆరా తీసిన పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సగర, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, రామినేని రమాదేవి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ టి.ఉదయ్‌భాస్కర్, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

ఎంపీ వల్లభనేని బాలశౌరి

గన్నవరం: ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో సామాజిక భవనాలను నిర్మిస్తున్నట్లు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. స్థానిక రజక రామాలయం ఆవరణలో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బాలశౌరి మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో పెద్ద సంఖ్యలో కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. వీటిని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీలు అనగాని రవి, చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, కాకర్లమూడి సువర్ణరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, సచివాలయాల కన్వీనర్ కైలే శివకుమార్, పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు,రజక రామాలయ పెద్దలు పాల్గొన్నారు.



గన్నవరంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వంశీ

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

గన్నవరం రూరల్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కోరారు. శనివారం మండలంలోని తెంపల్లి గ్రామంలో రూ.19.80 లక్షల ఖర్చుతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలును ఆయన ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శుభకార్యాలు జరుపుకునేందుకు ఈ కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. అనంతరం గ్రామంలోని బల్లిపర్రు రోడ్డును ఎంపీ, ఎమ్మెల్యే సందర్శించారు. ఈ రోడ్డుపై నీరు నిలిచి ఇక్కట్లు పడుతున్నామని గ్రామస్తులు చెప్పడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కొలుసు శిరీష, ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, వీరపనేనిగూడెం ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నీలం బాలు, కొత్తగూడెం ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, ఎంపీడీవో సత్యకుమార్, పీఆర్ ఏఈ దాసు, బీసీ కమ్యూనిటీ హాల్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదానంకు విద్యార్థులు ముందుకు రావాలి

పెనమలూరు: రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణం కాపాడవచ్చని, రక్తదానంకు విద్యార్థులు ముందుకు రావాలని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ బావినేని పాండురంగారావు అన్నారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా కాలేజీలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేయగా మరో 200 మంది విద్యార్థులకు గ్రూపింగ్ నిర్వహించామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు శంకర్‌నాథ్, డాక్టర్ వీరేంద్రనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



హనుమాన్‌జంక్షన్ రూరల్: వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం హనుమాన్‌జంక్షన్‌లో ఆటోల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలిలో ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్‌కు ఆటోడ్రైవర్లు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. భీమ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ఆటోలతో ప్రధాన రహదారుల్లో ర్యాలీ చేశారు. థ్యాంక్యూ సీఎం జగన్ అంటూ పెద్ద ఎత్తున ఆటోడ్రైవర్లు నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొమరవల్లి థామస్, ఆటోయూనియన్ నాయకులు గుడిమెళ్ల నాగరాజు, బట్టు జాన్ ప్రకాష్, కాటుమాల ఆనంద్‌కుమార్, క్రాంతి కిరణ్, సూర్య, ప్రభాకరరావు, జాషువా పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మకాలజీ జాతీయ సదస్సు

ఏపీ ఫార్మకాలజీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ శంకర్



గన్నవరం రూరల్: ఆహారమే ఔషధంగా పని చేయాలని ఏపీ ఫార్మకాలజిస్ట్స్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.శంకర్ చెప్పారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫార్మకాలజీ ఆధ్వర్యంలో ఏపీ ఫార్మకాలజీ సొసైటీ నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ ఫార్మకాలజీ కాన్ఫరెన్స్-2023 శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి మార్పులతో ప్రజల ఆరోగ్యం రక్షింపబడుతుందని, ఈ మేరకు విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కొవ్వు శాతం తగ్గించి ప్రొటీన్‌లు, మంచి ఫ్యాట్ కలిగిన ఆహారం తీసుకుని ప్రజలు దీర్ఘకాలం జీవించే విధానంపై ప్రచారం జరగాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ శుభ్రోజ్యోతి భౌమిక్, డాక్టర్ పద్మజ ఉదయ్‌కుమార్, డాక్టర్ సుభోద్ శిరోర్, డాక్టర్ రమేష్, డాక్టర్ మీనా కుమారి, డాక్టర్ రవీంద్ర ప్రసంగించారు. డాక్టర్ పిసిమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, అబ్జర్వర్ డాక్టర్ స్వర్ణలత, హెచ్‌వోడీ డాక్టర్ సుప్రియ ప్రియంవద, కళాశాల ఫార్మకాలజీ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ

గన్నవరం: జిల్లా స్థాయి సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..విజయవాడలోని ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ స్వర్ణోత్సవాల్లో భాగంగా పరంపర అవర్ హెరిటేజ్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సాహిత్య, సాంస్కృతిక, స్పెల్‌బీ, పద్యపఠనం, స్టోరీస్, మెమరీ టెస్ట్, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, క్లేమోడలింగ్, క్విజ్, డ్రాయింగ్, డ్యాన్స్, పాటల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి పోటీలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. సాహిత్య, సాంస్కృతిక విభాగాల పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు వివరించారు. అనంతరం బహుమతులు సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్, సీనియర్ బ్రదర్లు జిమ్మీకురియాకోస్, భల్లాజోసఫ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. రహదారులు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాల సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే పార్థసారథికి వివరించారు. ఆయా సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, పిన్నబోయిన శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు వీరంకి నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా నాగరాజు, ఉప్పలూరి సునీల్, లంక వెంకయ్య, కలపాల వజ్రాలు, దండాబత్తిన సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.